


జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| సోమవారం 02 మార్చి 2026 | పేజీలు 04 | వెల రూ: 2/- | సంపుటి 01 ,సంచిక 273 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత |
|---|---|---|---|---|---|



## ఎన్పీడీసీఎల్ చరిత్రలో రికార్డు స్థాయి విద్యుత్ డిమాండ్ 6267 మెగావాట్లు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 2: తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) చరిత్రలోనే అత్యధికంగా 6267 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు అయినట్లు సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. శనివారం నమోదైన 6057 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌ను అధిగమిస్తూ ఆదివారం 6267 మెగావాట్లకు చేరుకోవడం సంస్థ చరిత్రలో మైలురాయిగా నిలిచిందన్నారు. రోజురోజుకు ఎండలు తీవ్రంగా పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, అయినప్పటికీ ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టామని చెప్పారు. మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి డిమాండ్ ఎంత పెరిగినా సరఫరాలో అంతరాయం రాకుండా పూర్తిగా సమాయత్తమయ్యామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ పర్యవేక్షణ, దిశానిర్దేశంతో వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. వచ్చే వేసవిలో డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని సీఎండీ తెలిపారు. ప్రజా సంబంధాల అధికారిచే ఈ ప్రకటన విడుదలైంది.



## ప్రధాని నరేంద్ర మోడి తాజా కార్యక్రమాలు దేశవ్యాప్తంగా పలు ప్రారంభాలు

సూర్యాపేట సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 2: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గుజరాత్‌లో మైక్రాన్ సంస్థ సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తూ భారత్ ప్రపంచ హార్డ్‌వేర్ తయారీ రంగంలో ముందుకు వెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశంలో సాంకేతిక అభివృద్ధి మరియు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని అన్నారు. దేశంలో మహిళల ఆరోగ్య రక్షణ కోసం 14 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించి, భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ తగ్గించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా అమలు చేయబడుతోంది. అలాగే తమిళనాడు, పుదుచ్చేరి, మధురై ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి రైల్వే, రహదారి, మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ పర్యటన రాజకీయంగా కూడా ముఖ్యమైందిగా భావిస్తున్నారు.జమ్మూ కాశ్మీర్ రంజీ ట్రోఫీ గెలిచిన సందర్భంగా ఆటగాళ్లను అభినందిస్తూ దేశ యువత క్రీడల్లో ముందుకు రావాలని ప్రధాని పిలుపునిచ్చారు.ప్రస్తుతం ప్రధాని పర్యటనలు, అభివృద్ధి ప్రాజెక్టులు, ఎన్నికల రాజకీయాలు కలిసి దేశ రాజకీయాల్లో వేడి పెంచుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

## రైతులకు నష్టం చేసే ఒప్పందం – కేంద్రంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు



సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 2: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పంజాబ్ రాష్ట్రంలో జరిగిన భారీ సభలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఇండియా-అమెరికా వాణిజ్య ఒప్పందం రైతులకు నష్టాన్ని కలిగించేలా ఉందని, ఇది రైతులకు మరణ శాసనం లాంటిదని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం వల్ల విదేశీ వ్యవసాయ ఉత్పత్తులు దేశంలోకి రావడంతో చిన్న రైతులు పోటీ పడలేరని, వారి జీవనోపాధి దెబ్బతింటుందని తెలిపారు.సభలో మాట్లాడుతూ దేశ ప్రయోజనాల కంటే విదేశీ ఒత్తిడికి లోనై కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారుల ప్రయోజనాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఉండకూడదని, అందరూ కలిసికట్టుగా పని చేయాలని పార్టీ నాయకులకు హెచ్చరించారు. పార్టీ కంటే ఎవ్వరూ పెద్దవారు కారని స్పష్టం చేశారు. పంజాబ్‌లో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ బలపడేందుకు ఈ సభను నిర్వహించినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రైతుల సమస్యలు, ఉద్యోగాలు, ధరల పెరుగుదల వంటి అంశాలపై పోరాటం కొనసాగిస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు.



## తెలంగాణ రాష్ట్రం ఆత్మ కళలు కళలు, సంస్కృతికి పెద్దపీట

### దేవాలయాలు-పర్యాటకం సంస్కృతి కలిపి యాక్షన్ ప్లాన్ రూపొందించాలి: భట్టి విక్రమార్క

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 02: తెలంగాణ రాష్ట్రం ఆత్మ కళలేనని, రాష్ట్రంలోని కళలు, సంస్కృతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ లోని ఎల్బీ ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించిన రామదాసు జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ నేల గర్వించదగ్గ గొప్ప వాగ్గేయకారుడు భద్రాచల రామదాసు అని కొనియాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలోని కళాకారులకు, సాంస్కృతిక వైభవానికి పూర్వ వైభవం తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో కళా కార్యక్రమాల రూపంలో ప్రజలకు చేరవేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా సంగీత నాటక అకాడమీ విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, అవసరమైన నిధులు సమకూర్చుతామని భరోసా ఇచ్చారు. నేలకొండపల్లిలో జన్మించిన గోపన్న తన భక్తితో భక్త రామదాసుగా చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన నిర్మించిన భద్రాచలం ఆలయం, రాసిన కీర్తనలు ప్రతి తెలుగువారి గుండెల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తరువాత మన ప్రాంత వాగ్గేయకారుల గొప్పతనాన్ని చాటిచెప్పేలా ఇటువంటి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కళలు ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించే ఆయుధమని, గ్రామాల్లో సమస్యలకు కళారూపాల ద్వారానే పరిష్కారం తీసుకువచ్చిన చరిత్ర మనదని అన్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం వంటి ప్రపంచ వారసత్వ కట్టడాలు, రాష్ట్రంలోని పురాతన దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలను కలుపుతూ సంస్కృతి–పర్యాటకం మేళవించిన ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సంగీత నాటక అకాడమీకి ఆదేశించారు. కళల పట్ల ప్రజలకు ఉన్న మక్కువ చూసి ఆనందంగా ఉందని, భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని విధాలా ఆర్థిక సహాయం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

## మరో ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు హైదరాబాద్ ఆతిథ్యం

### మార్చి 8 నుంచి మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ ప్రారంభం






సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 02: మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్-2026 టోర్నమెంట్‌కు హైదరాబాద్ నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. మార్చి 8 నుండి 14 వరకు గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరిగే ఈ అంతర్జాతీయ పోటీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడాశాఖ ఆధ్వర్యంలో అత్యున్నత ప్రమాణాలతో ఈ టోర్నమెంట్ నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించబడింది. ఈ క్వాలిఫయర్స్‌లో భారత్, ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ దేశాల జట్లు పాల్గొంటున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాల ఆస్ట్రో టర్ఫ్, ఆధునిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, క్రీడాకారులు మరియు అధికారులకు ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పించారు. ఇప్పటికే కొన్ని జట్లు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. టోర్నమెంట్ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, వారసత్వాన్ని పరిచయం చేసే ప్రత్యేక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. మహిళల హాకీ వరల్డ్ కప్‌కు అర్హత సాధించేందుకు కీలకమైన ఈ పోటీలతో హైదరాబాద్ మరోసారి అంతర్జాతీయ క్రీడా పటంలో ప్రత్యేక గుర్తింపు పొందనుంది.






## తెలుగు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి గల్ఫ్ దేశాల్లో ఉన్న వారంతా భద్రతా సూచనలు తప్పనిసరిగా పాటించాలి: రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 02: ఇరాన్ మరియు గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధ పరిస్థితులపై వస్తున్న వార్తల నేపథ్యంలో భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆయా దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించి పాటించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే అక్కడ ఉన్న తెలుగు ప్రజలను సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటుందని చెప్పారు. ఇరాన్ మరియు ఇతర గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని వెల్లడించారు. అవసరమైతే తక్షణ చర్యలు తీసుకునేందుకు అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. భారత ఎంబసీలు, కాన్సులేట్లతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని ఆదేశించారు. తెలంగాణ ప్రజల భద్రత రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, విదేశాల్లో ఉన్న ప్రతి తెలుగు వ్యక్తి సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# గుజరాత్‌లో మంత్రి వాకిటి శ్రీహరి బృందం పర్యటన

## అమూల్ పాల ప్లాంట్ సందర్శన – ఘనస్వాగతం పలికిన ఎన్‌డీడీబీ చైర్మన్



సందేశం టైమ్స్, గుజరాత్, మార్చి 02: గుజరాత్ రాష్ట్రంలోని అమూల్ పాల ప్లాంట్‌ను రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బృందం సందర్శించింది. ఈ పర్యటనలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. గుజరాత్‌లోని ప్రముఖ పాల ఉత్పత్తి సంస్థ అమూల్ కార్యకలాపాలను పరిశీలించిన మంత్రి బృందానికి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) చైర్మన్ డాక్టర్ మీనేష్ షా ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ విధానాలపై అధికారులు వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో పాడిపరిశ్రమ అభివృద్ధికి గుజరాత్ మోడల్‌ను అధ్యయనం చేసి అమలు చేయడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.



# యువ ఆపద మిత్ర పథకానికి తెలంగాణలో విశేష స్పందన

## 99 రోజుల శిక్షణలో యువతకు విపత్తు నిర్వహణ నైపుణ్యాలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 02: తెలంగాణలో విపత్తుల సమయంలో వెంటనే స్పందించే సహాయక బృందాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యువ ఆపద మిత్ర పథకానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ పథకం ద్వారా యువతకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు విపత్తు నిర్వహణలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడం జరుగుతోంది. రీజినల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ (RCUES) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి ఎంపికైన యువకులు పాల్గొంటున్నారు. మహబూబ్‌నగర్ కేంద్రంగా జరుగుతున్న శిక్షణలో ఎన్‌ఎస్‌ఎస్‌కు చెందిన వాలంటీర్లు సహా పెద్ద సంఖ్యలో యువత పాల్గొంటున్నారు. మొత్తం 99 రోజులపాటు కొనసాగే ఈ కార్యక్రమంలో విపత్తుల సమయంలో చేపట్టాల్సిన రక్షణ చర్యలు, సహాయక కార్యక్రమాలు, ప్రాథమిక చికిత్స, అగ్ని ప్రమాదాలు, వరదలు, భూకంపాలు వంటి పరిస్థితుల్లో ఎలా స్పందించాలో శిక్షణ ఇస్తున్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో యువ ఆపద మిత్ర బృందాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి జిల్లాలో మాక్ డ్రిల్లులు నిర్వహించి యువతను అప్రమత్తం చేయడం జరుగుతోంది. ఈ కార్యక్రమాన్ని యువజన సర్వీసులు, వైఎంఎస్, ఎన్‌ఎస్‌ఎస్ మరియు రెడ్ క్రాస్ సంస్థల సమన్వయంతో నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ప్రతి జిల్లాలో ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి మరింత మంది యువతకు అవకాశం కల్పించాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందడంతో పాటు విపత్తుల సమయంలో ప్రజలకు తక్షణ సహాయం అందించే సామర్థ్యం పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

# మైనార్టీ కోటాలో కోఆప్షన్ ఆశిస్తున్న చోటు ఖాన్



సందేశం టైమ్స్, జోగిపేట, మార్చి 02 (టి సంగమేశ్వర్): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం కొనసాగుతున్న నేపథ్యంలో ఆందోల్-జోగిపేట మున్సిపాలిటీలో కూడా కాంగ్రెస్ హవా స్పష్టంగా కనిపించింది. ఈ క్రమంలో పార్టీకి ఇరువై ఏళ్లుగా సేవలందిస్తున్న యువ నాయకుడు చోటు ఖాన్ మైనార్టీ కోటాలో కోఆప్షన్ సభ్యత్వాన్ని ఆశిస్తున్నారు. మైనార్టీ నిరుపేద కుటుంబంలో జన్మించిన చోటు ఖాన్ ఐదుగురు అన్నదమ్ముల్లో చిన్నవాడిగా కుటుంబ బాధ్యతలను చిన్న వయసులోనే భుజాన వేసుకొని పార్టీ కోసం కష్టపడ్డాడని అనుచరులు తెలిపారు. పెద్దన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ పట్ల నమ్మకం కోల్పోకుండా సేవలు కొనసాగించాడని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానానికి మంత్రి దామోదర రాజనర్సింహ ప్రేరణ అని, ఆయన మార్గదర్శకత్వంలోనే ప్రజాసేవ చేస్తున్నానని చోటు ఖాన్ తెలిపారు. 15వ వార్డుకు చెందిన ఆయన స్వంత వార్డు మాత్రమే కాకుండా 17వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ చిట్టిబాబుకు కూడా అండగా నిలిచి ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేశారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం మున్సిపల్ పాలకవర్గం ఏర్పడుతున్న నేపథ్యంలో కోఆప్షన్ సభ్యుల ఎంపికపై చర్చలు కొనసాగుతుండగా మైనార్టీ కోటాలో తనకు అవకాశం కల్పించాలని చోటు ఖాన్ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. ఇరవై ఏళ్లుగా పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తకు అవకాశం ఇవ్వాలని స్థానిక మైనార్టీ నాయకులు, కొందరు కౌన్సిలర్లు కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని, మంత్రి తీసుకునే నిర్ణయం పై పట్టణంలో ఆసక్తి నెలకొంది.

# రేణుకాచార్యుల జయంతి ఘనంగా నిర్వహించిన రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 2: రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ ఆది జగద్గురు రేణుకాచార్యుల జయంతి వేడుకలు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గల హరిహర వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు పట్లోళ్ల మల్లికార్జున్ పాటిల్ మాట్లాడుతూ రేణుకాచార్యులు తెలంగాణలోని కొలన్‌పాక సోమేశ్వర స్వామి దేవాలయంలో స్వయంభువుగా వెలసి, అగస్త్య మహాముని సిద్ధాంత శిఖామణిని బోధించి వీరశైవ ధర్మాన్ని స్థాపించిన మహానుభావుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్, ముఖ్య సలహాదారు సంగుశెట్టి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ అశోక్ బాబు, ఉపాధ్యక్షులు గౌలీశ్వర్, మహిళా కమిటీ అధ్యక్షురాలు వీరమణి, సభ్యులు జి.వీరన్న, యాదప్ప, హనుమప్పతో పాటు మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేటలో డాక్టర్ సోమేశ్వర్ కుమారుడు విశ్వేశ్వర్ రిసెప్షన్ ఘనంగా



సందేశం టైమ్స్, జోగిపేట, మార్చి 2 (టీ సంగమేశ్వర్): జోగిపేట పట్టణానికి చెందిన డాక్టర్ సోమేశ్వర్ ఏకైక కుమారుడు విశ్వేశ్వర్ రిసెప్షన్ వేడుకలు జోగిపేటలోని శ్రీరామ గార్డెన్‌లో వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, 13వ వార్డు కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్ గౌడ్, పట్లోళ్ల ప్రవీణ్, డాకుర్ శీను, డాకుర్ వెంకన్న, పిట్టల లక్ష్మణ్ (మాజీ కౌన్సిలర్), ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రంగ సురేష్, 16వ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల శ్రీనివాస్, 2వ వార్డు కౌన్సిలర్ రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు నారా బిక్షపతి, డీబీ నాగభూషణం, చాపల వెంకటేశం, సారా శ్రీధర్, ఆకుల శంకర్, వార్డు వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు రంగ హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ (రాజు), అధ్యక్షులు సత్యం, రాములు, సురేష్, కోశాధికారి గజవడా రాజు తదితరులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వేడుకలు ఆనందోత్సాహాల మధ్య సాంప్రదాయబద్ధంగా కొనసాగాయి.

# మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 2 (బి. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో మాజీ సర్పంచ్ అంకుశ ఇంద్రారెడ్డి తండ్రి సిరిపురం లక్ష్మారెడ్డి మృతి చెందడం పట్ల సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే ఇంద్రారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మారెడ్డి మరణం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఇంద్రారెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో పార్టీ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు విట్టల్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వహీద్, సర్పంచ్ నర్సింలు, ఉప సర్పంచ్ పాండు రంగారెడ్డి, నాయకులు సంతోష్ రెడ్డి, సుధీర్ రెడ్డి, రాములు, సంగమేశ్వర్ గౌడ్, లక్ష్మీకాంత్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

# గురుజువాడలో వైభవంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ


## పండుగ వాతావరణంలో ఘనంగా మహోత్సవం





సందేశం టైమ్స్, గురుజువాడ, మార్చి 2(టీ సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండల పరిధిలోని గురుజువాడ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమం గ్రామ చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత వైభవంగా సాగగా గ్రామమంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది. భక్తి, దేశభక్తి, సాంస్కృతిక వాతావరణం నడుమ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, ఆదిత్యపరాశ్రీ స్వామిజీ ముఖ్య అతిథులుగా హాజరై ఆశీర్వచనాలు అందించారు. ఈ వేడుకకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గొల్ల భాస్కర్, కోహిర్ మండల అధ్యక్షుడు వైద్యనాథ్, బూత్ అధ్యక్షులు జి. చంద్రశేఖర్, కె.జి. శివశంకర్, నాయకులు కిస్టన్న, మాజీ సొసైటీ చైర్మన్ శంకర్ రెడ్డి, నర్సింలు, నరేష్, జహీరాబాద్ టౌన్ అధ్యక్షులు పూల సంతోష్, కౌన్సిలర్లు అప్పం శ్రవణ్, బొగ్గుల సంతోష్, ప్రసాది మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శివాజీ మహారాజ్ వీరత్వం, పరాక్రమం, దేశభక్తి స్ఫూర్తిని నేటి తరాలకు అందించాలనే సంకల్పంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మహోత్సవం గురుజువాడ గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలిచి అందరి హృదయాలను హత్తుకుంది.

# మెడికుందా గ్రామపంచాయతీ కార్యాలయానికి నూతన నేమ్ బోర్డు ఏర్పాటు




సందేశం టైమ్స్, వట్పల్లి, మార్చి 2 (టి. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలోని మెడికుందా గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయానికి నూతన నేమ్ బోర్డును గ్రామ సర్పంచ్ ఎన్. చంద్రకళ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ బోర్డుపై సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యుల పేర్లు కూడా పొందుపరిచారు. నూతన నేమ్ బోర్డు ఏర్పాటుతో గ్రామపంచాయతీకి ప్రత్యేక గుర్తింపు వచ్చినట్లు స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వార్డు సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ గ్రామ అభివృద్ధికి పారదర్శకతతో పాటు ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలనే ఉద్దేశంతో ఈ నేమ్ బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ నాలాచేరు కాచూర్ రావు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# మనూర్‌లో బీరప్ప జాతరలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పట్లోల చంద్రశేఖర్ రెడ్డి

సందేశం టైమ్స్, మనూర్, మార్చి 2 (టి. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా మనూర్ మండల కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ బీరప్ప స్వామి వారి కళ్యాణం మరియు జాతర కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పట్లోల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు సిద్ధారెడ్డి (సర్పంచ్), మాజీ ఎంపీటీసీలు పండరి రెడ్డి, ముంతాజ్, సంగన్న (న్యాయవాది), కాలే రాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంగ్టి, రాజు యాదవ్, భీమన్న తదితర నాయకులు పాల్గొన్నారు. జాతర వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగాయి.

# అంకమ్మ తల్లి తిరునాళ్లకు కోమట్లగూడెం సిద్ధం
## మార్చి 1–5 వరకు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు




సందేశం టైమ్స్, కోమట్లగూడెం, మార్చి 2 (ప్రతినిధి): ఖమ్మం జిల్లా చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ అంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలు మార్చి 1 నుండి 5 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. గత 28 సంవత్సరాలుగా సంప్రదాయబద్ధంగా జరుగుతున్న ఈ మహోత్సవాలు ప్రాంతీయ ఆధ్యాత్మిక వేడుకగా ప్రత్యేక గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. మహోత్సవాల సందర్భంగా గ్రామం మొత్తం ఉత్సవ శోభతో కళకళలాడనుంది.మహోత్సవాల తొలి రోజు మహాభిషేకం, ప్రత్యేక పూజలు, స్వామివారి ఊరేగింపు నిర్వహించనుండగా, మార్చి 2న ఉదయం తీర్థప్రసాదం, అనంతరం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామివారి కళ్యాణం ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, ప్రసాదం, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మార్చి 3న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించనుండగా, మార్చి 5న "డాన్స్ బేబీ డాన్స్" పోటీలు జరగనున్నాయి. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. పోటీల నిర్వహణకు అవులూరి రామిరెడ్డి, రాయల శ్రీను, వేముల జానకిరాములు సమన్వయ బాధ్యతలు చేపట్టగా, జాతర ప్రారంభోత్సవాన్ని చింతకాని సబ్ ఇన్స్పెక్టర్ ఎస్. వీరేందర్ ప్రారంభించనున్నారు.మహోత్సవాల నిర్వహణలో దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు చురుకుగా పాల్గొంటున్నారని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.



# శ్రీ పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

సందేశం టైమ్స్ – పటాన్చెరు, 02-03-2026 (రిపోర్టర్: బి. డేవిడ్) ముత్తంగి డివిజన్ పోచారం పరిధిలోని మహీధర లగ్జూరియా కాలనీలో శ్రీ పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరై ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ, ఆలయ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా కాలనీలోని ప్రజా సమస్యలను త్వరలో పరిష్కరించడానికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు చురుకుగా పాల్గొన్నారు

# కంచర్ల గూడెంలో ఘనంగా మల్లన్న జాతర



సందేశం టైమ్స్ – పటాన్చెరు, 02-03-2026 (రిపోర్టర్: బి. డేవిడ్)కంచర్ల గూడెంలో ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి-చిత్తారమ్మ కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి జాతరలు ప్రతి ఊర్లో జరుపుకోవాలి, వేరే రాష్ట్రాలకు వెళ్లి అక్కడే ఆలయాలను అభివృద్ధి చేయకుండా, మన సొంత ఊర్లో ఉన్న ఆలయాలను పట్టించుకోవాలని, ప్రతి ఆలయంలోనూ పూజలు నిర్వహిస్తూ, మన సొంత ఊరి ఆలయాలను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. భగవంతుడు ఎక్కడైనా ఉంటాడు, ప్రత్యేకించి మన ఊరి ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఆయన ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తారని భరోసా ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

# నూతన రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



సందేశం టైమ్స్, అనంతగిరి, మార్చి 2 (ప్రతినిధి): మండల పరిధిలోని పాలవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన తారు రోడ్డు, సీసీ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజా నాయకుడు మట్టపల్లి ఏకలవ్య కోరారు. ఆయన మాట్లాడుతూ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల వాహనదారులు అధిక వేగంతో ప్రయాణిస్తున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సాయంకాల సమయంలో చిన్నపిల్లలు రోడ్డుపై తిరిగే అవకాశం ఉన్నందున గ్రామంలో వెళ్లే వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ఈ విషయమై ఆర్ అండ్ బి ఏఈను వివరణ కోరగా, విషయం తమ దృష్టికి వచ్చిందని, త్వరలోనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# కోదాడలో 'ఆపరేషన్ క్రాక్‌డౌన్'.. సైబర్ నేరగాళ్ల అరెస్ట్!

సందేశం టైమ్స్, సూర్యాపేట జిల్లా కోదాడ, మార్చి 2 (ప్రతినిధి వెంకటేష్): సైబర్ నేరాల నియంత్రణకు పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ క్రాక్‌డౌన్' కోదాడలో తీవ్ర సంచలనం సృష్టించింది. ప్రధానంగా బైనాన్స్ (Binance) వంటి క్రిప్టో కరెన్సీ యాప్‌ల ద్వారా అక్రమ వ్యాపారాలు నిర్వహిస్తున్న ముఠాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.ఇలాంటి కార్యకలాపాల్లో ఇతరుల బ్యాంక్ ఖాతాలను అక్రమంగా ఉపయోగిస్తూ సైబర్ మోసాలకు పాల్పడుతున్న మొత్తం 16 మందిపై ఇప్పటికే కేసులు నమోదు అయ్యాయి. ఆపరేషన్‌లో కోదాడ పట్టణం మరియు పరిసర మండలాల నుంచి దాదాపు 116 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు అధికారులు తెలిపారు.సైబర్ నేరాలపై మూడుకు అడ్డంగా మారుతున్న ప్రాంతాలపై దృష్టి సారించిన పోలీసులు, ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న మరికొందరి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేస్తున్నారు.



# మల్లూరు గిరిధామం.. భక్తి పారవశ్యం!

మార్చి 2 – ములుగు (సందేశం టైమ్స్, రిపోర్టర్: రమేష్ బాబు) ప్రకృతి ఒడిలో, పచ్చని అడవుల మధ్యలోని మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆదివారం ఉదయం ఆధ్యాత్మిక శోభతో నిండింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తన సతీమణి మాధురితో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దంపతులు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజల ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ప్రార్థించారు. ఆలయ అర్చకులు వారికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి, వేద ఆశీర్వచనాలను పలికారు.మంత్రి శ్రీనివాస రెడ్డి తో పాటు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి మరియు ఆయన సతీమణి శ్రీలక్ష్మి రెడ్డి ఆలయానికి చేరుకుని స్వామివారికి భక్తిశ్రద్ధలతో నీరాజనాలు అర్పించారు.పూజా కార్యక్రమాల అనంతరం స్థానిక ప్రజలు, కార్యకర్తలు క్షేత్రానికి తరలివచ్చి, మల్లూరు స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు. ఈ పర్యటనతో మల్లూరు గిరిధామం మరింత భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.



## అసెంబ్లీ నుంచి మున్సిపల్ దాకా.. అంతా 'వన్ సైడ్'!

మార్చి 2, 2026 – భద్రాచలం (సందేశం టైమ్స్, రిపోర్టర్: రమేష్ బాబు)"ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మా పక్షమే... కుతంత్రాలకు దేవుడు శిక్ష వేస్తాడు... ప్రతిపక్ష నేతలు ఒంటి నిండా విషం నింపుకుని చిమ్ముతున్నారు... వర్షాకాలం పంట నాటికి 'పాలెం వాగు' పూర్తి చేస్తాం" అని భద్రాచల నియోజకవర్గ పర్యటనలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.ఆదివారం నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచుల సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ, "రెండేళ్ల క్రితం రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నుంచి పార్లమెంట్, ఉప ఎన్నికలు, మొన్నటి పంచాయతీ, తాజాగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల వరకు ప్రజలు మన పార్టీని వంతుగా ఆశీర్వదించారు. ఏ ఎన్నిక వచ్చినా తీర్పు వన్ సైడ్. గత పాలకులు ఒంటి నిండా విషం చిమ్మినా, ప్రజలు, భగవంతుడు వారికి తగిన బుద్ధి చెప్పతారని నమ్మకం" అని పేర్కొన్నారు.మంత్రిత్వం సమయంలో పొంగులేటి గారు గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో నష్టం జరిగిందని, 15 వేల ఎకరాలకు నీరు రావాల్సిన పాలెం వాగు ప్రాజెక్టును రెండు-మూడు రోజుల్లో పూర్తి చేస్తామని, రాళ్లవాగు వంతెనను కూడా ఈ సీజన్లో పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు.అదేవిధంగా, ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు ఒక్కటో తారీఖున నేరుగా జమ చేయడం, లంచం లేకుండా ఇళ్లు నిర్మాణ నిధులను అందించడం, ములుగు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట ప్రాంతాల్లో నిరుపేదలకు మొదటి విడత ఇళ్లను కేటాయించడం వంటి కార్యక్రమాలపై మంత్రి వివరించారు. మరో రెండు విడతలలో మొత్తం అర్హులకూ ఇళ్లను అందిస్తామని చెప్పారు.కాబట్టి కొత్తగా ఎన్నికైన మహిళా సర్పంచులకు ఆయన ఆత్మీయ పిలుపునిచ్చి, "ఎల్లా అధికారం తీసుకుని ఆదర్శంగా పాలించాలి. మన ఎమ్మెల్యేలు, మంత్రులలా ధైర్యంగా పాలించండి" అని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), స్థానిక పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బెంగళూరులో ప్రేమ వివాదం కత్తితో దాడి, ప్రియుడు పరిస్థితి విషమం



మార్చి 2, 2026 – బెంగళూరు (సందేశం టైమ్స్, రిపోర్టర్: శెట్టి వెంకటేష్) బెంగళూరు జిల్లా, రామనగర్ తాలూకాలోని బిదడి వద్ద ప్రేమ వివాదం తీవ్ర రూపం తీసుకున్నది. గత ఒక సంవత్సరం పాటు ప్రేమలో ఉన్న వేణుగోపాల్ (27), జిమ్ నిర్వాహకుడు, మరియు సుధ (30) మధ్య సంబంధ సమస్యల కారణంగా ఘోర ఘటన చోటు చేసుకుంది.సుధకు సమాచారం చేరింది వేణుగోపాల్ ఇతర యువతితో సంబంధం పెట్టుకున్నాడని. కారణాన్ని అడిగినా సమాధానం లేకపోవడం, మోసంలో ఉందని భావించడం ఈ వ్యవహారానికి దారితీసింది. గత కొన్ని రోజులుగా సుధ తన హ్యాండ్ బ్యాగ్‌లో కత్తిని పెట్టుకొని తిరుగుతూ ఉంటుందని తెలుస్తోంది.మొన్నటివరకు ఫోన్ చేసి సమాధానం కోరగా, వేణుగోపాల్ ప్రేమ, పెళ్లి విషయాలను తప్పించుకున్నాడు. కోపానికి లోనైన సుధ హ్యాండ్ బ్యాగ్ నుంచి కత్తిని తీసుకొని ప్రణాళికబద్ధంగా దాడి చేసింది. దాడి అనంతరం సుధ స్థానిక వాహనంపై పారిపోయింది.ప్రస్తుతం వేణుగోపాల్ ఆస్పత్రిలో ప్రమాదకర స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై సుధ కోసం పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు.



## ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి.. 40 రోజుల పాటు సంతాప దినాలు!

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి కళ్యాణి: ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ (86) మరణించినట్లు ఆ దేశ అధికారిక స్టేట్ మీడియా ఆదివారం ధృవీకరించింది. ఆయనపై జరిగిన సంయుక్త సైనిక దాడుల సమయంలో తన కార్యాలయంలోనే ఖమేనీ ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ ప్రసార మాధ్యమాలు వెల్లడించాయి. 1989 నుండి ఇరాన్ అత్యున్నత నాయకుడిగా కొనసాగిన ఖమేనీ, అంతర్జాతీయ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన పాత్ర పోషించారు. ఆయన మృతికి సంతాపంగా ఇరాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 40 రోజుల పాటు సంతాప దినాలను ప్రకటించడమే కాకుండా, అధికారిక సంతాప కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే, ఇదే దాడుల్లో ఖమేనీ కుటుంబ సభ్యులు కూడా మరణించినట్లు 'ఫార్స్' న్యూస్ వంటి మీడియా సంస్థలు వెల్లడించడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ పరిణామంపై అమెరికా మాజీ అధ్యక్షుడి వ్యాఖ్యలతో పాటు పలు అంతర్జాతీయ నివేదికలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

## తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి గారు.. పశ్చిమాసియాలో చిక్కుకున్న తెలుగు వారి భద్రతపై కీలక సూచనలు



హైదరాబాద్, సందేశం టైమ్స్: పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు, ఆ ప్రాంతాల్లో ఉన్న తెలుగు వారంతా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా, క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా యుద్ధ వాతావరణం, కొన్ని దేశాల విమానాశ్రయాలను మూసివేయడం వంటి సవాళ్ల నేపథ్యంలో ఇరాన్, దుబాయ్ తదితర ప్రాంతాల్లో చిక్కుకున్న వ్యక్తులు సంబంధిత దౌత్య కార్యాలయాల మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. తెలంగాణ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజల భద్రత అత్యంత ప్రాధాన్యం అని పేర్కొని, ఈ అత్యవసర పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. గల్ఫ్ ప్రాంతాల్లో చిక్కుకున్న భారతీయుల భద్రత కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రధానంగా కేంద్ర ప్రభుత్వానికి సూచిస్తూ, విదేశీ వ్యవహారాల మంత్రి శ్రీ జైశంకర్ గారిని సంబంధిత చర్యలు తీసుకోవడానికి ఆయన విజ్ఞప్తి చేశారు.



## వెలుగుమట్ల బాధితులకు మంత్రి పొంగులేటి భరోసా

మార్చి 2, 2026 – ఖమ్మం (సందేశం టైమ్స్, రిపోర్టర్: వెంకటేష్) అప్పులు చేసి నిర్మించుకున్న ఆశల గూడు కూలిపోయిందని ఆవేదన చెందకండి... ఈ ప్రభుత్వం మీది. మీ కన్నీరు తుడిచే బాధ్యత నాది అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెలుగుమట్ల బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ నెల 15వ తేదీలోపు అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాల పట్టాలు, రూ. 5 లక్షల విలువల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.ఆదివారం ఖమ్మం ఐడిఓసి వేదికగా జరిగిన భేటీలో మంత్రి వ్యక్తిగతంగా బాధితుల సమస్యలను విన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో కొన్నేళ్లుగా దళారుల పీడన, నిరుపేదలు అనుభవిస్తున్న నరకయాతనాలు బయటకు వచ్చాయి. తక్కువ ధరకే స్థలం వస్తుందని నమ్మి, 30 వేల నుంచి 8 లక్షల వరకు అప్పులు చెల్లించి దళారులకు కొనుగోలు చేసినప్పటికీ, కొన్ని ఇళ్లు కూల్చివేయడం వల్ల బాధితులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు.మంత్రిత్వంలో, పొంగులేటి గారు ఒక్క పైసా కూడా లంచం ఇవ్వాల్సిన పనిలేదని, పేదల రక్తం తాగిన దళారుల నుంచి డబ్బును రికవరీ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొత్తగా నిర్మించే కాలనీల్లో అన్ని మౌలిక వసతులు — రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, అంగన్వాడీలు, పాఠశాలలు — ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని తెలిపారు. నియోజకవర్గాల వారిగా బాధితులను గుర్తించి, వారి ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేశారు.అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో, గతంలో పాకులాడిన ప్రతిపక్ష నేతలపై మంత్రి పొంగులేటి గారు ధ్వజం ఎత్తి మండిపడ్డారు. "పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పటికీ ఈ పేదలు గుర్తుకు రాలేదా... అధికారం పోగానే షెడ్ల కింద కూర్చుని డ్రామాలు ఆడడం మూర్ఖత్వం. ఈ ప్రభుత్వం నిజమైన పేదలకే ఇళ్లు ఇస్తుంది" అని పేర్కొన్నారు.మంచి లబ్ధిదారుల ఎంపిక కోసం సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామని, ఈ నెల 15వ తేదీన తానే స్వయంగా ఇళ్ల స్థలాల పట్టాలు, ఇళ్ల ఆర్డర్లు అందజేస్తానని హామీ ఇచ్చారు. మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని కూడా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



## టీ20 వరల్డ్ కప్‌లో భారత్ ఘనవిజయం.. వెస్టిండీస్‌పై సంజూ శాంసన్ వీరోచిత పోరాటం!

సందేశం టైమ్స్, హైదరాబాద్, 02 మార్చి 2026 (రేపటి పేపర్) టీ20 ప్రపంచకప్ 2026 సూపర్ 8 దశలో భాగంగా జరిగిన ఉత్కంఠభరిత పోరులో వెస్టిండీస్‌పై భారత్ 5 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 195/4 స్కోరు చేసింది. అనంతరం 196 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, అవసరమైన చివరి 4 బంతులు మిగిలి ఉండగా 199/5 చేసి విజయం సాధించింది.భారత ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు; కేవలం 50 బంతుల్లోనే 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 97 నాటౌట్ రన్స్ చేయడంతో జట్టును గెలిపించారు. ఇతర బ్యాటర్లలో తిలక్ వర్మ (27), సూర్యకుమార్ యాదవ్ (18), హార్దిక్ పాండ్యా (17) విస్తృత సహకారం అందించారు. వెస్టిండీస్ బౌలర్లలో జేసన్ హోల్డర్, షమర్ జోసెఫ్ ఒక్కొక్కరు రెండు వికెట్లు తీసినా భారత విజయాన్ని ఆపలేకపోయారు.ఈ ఘనవిజయం ద్వారా టీమిండియా సెమీఫైనల్ దిశగా మరో కీలక అడుగు ముందుకు వేసింది.

## మత సామరస్యానికి ఇఫ్తార్ విందు ఘనంగా కూసుమంచిలో



సందేశం టైమ్స్, కూసుమంచి, మార్చి 2: తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం కూసుమంచి మండల కేంద్రంలోని శివాలయం రోడ్డులో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులతో కలిసి విందులో పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాస రెడ్డి రంజాన్ పవిత్ర మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనమని పేర్కొని నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.